

# శిలా తపస్విని - జలంధర

ఇవ్వాళ జూన్ పదకొండు..

సంవత్సరం తర్వాత గ్రాండ్ కెనియన్ దగ్గర.... నిరీక్షణ..... వస్తాడా అతను?!... ఏమో... సూర్యోదయానికి రకరకాల రంగుల లయలతో ఛాయలు మారిపోతున్న ఈ శిలా తపస్విని - ఏమంటావు? నీలాగా నేనూ నిరంతర నిరీక్షణలో బ్రతకాలా?!

ఈ గాజు వంతెన మీద... అన్ని శిలా స్వరూపాల మధ్య... ఏదో లోయలోకి జారిపోతున్న భ్రాంతి.... ఏమిటీ బలవంతపు పిలుపూ.... దూకేద్దామన్న ఉద్వేగం ...... ఒంటరి తనం నుంచి ఒక్కసారి విముక్తి....

ఒంటరితనం.... నిరీక్షణ... ఒకదానిలోనుంచి ఒకటి ఉద్భవించి, మళ్ళీ దానిలోనే ప్రవేశించి... చైనీస్ డ్రాగన్‌లాగా... ఆ మధ్యలో మెరిసే విస్ఫుటవు రవ్వల జల్లులకు జీవితం కాలిపోతుందా? మెరుస్తుందా?!

"నీ ఏటిట్యూడే" కారణం అంటాడు తను.

చేతిలో అతను ఇచ్చిన గ్రీటింగ్ కార్డ్ మెల్లిగా తెరిచి చూసింది. .... గ్రాండ్ కేనియన్.... ఎదురుగుండా...

Be careful not to enter another person’s life if you can not be a gift.

ఈ కొటేషన్ అంటే నాకు చాలా గౌరవం. నీ జీవితంలోకి గిఫ్ట్‌గా రాగలననుకున్న రోజున... వస్తాను... నీ కోసరం కాదు... నాకోసరం.

ఎన్ని సార్లు చదువుకుందో ఆ కొటేషన్ .... ఈ సంవత్సరం రోజుల్లో.

***

ఏదో మాయలో ఉన్నట్లు అంతా జరిగిపోయింది....

చదువు డిగ్రీలు ఇస్తుందేమో కానీ, విజ్ఞానం కూడా ఇస్తుందని ఎవరు చెప్పారు?!

నా వరకు నా చదువు... ఉద్యోగానికి పనికి వచ్చింది అంతే... అది తెలియడానికి ఇంత జరగాల్సివచ్చింది... ఇప్పటికైనా, ఏది నాకు కావాలో ఏది అక్కర్లేదో తెలిసిందా నాకు ?

అమెరికా వాతావరణంలో ఇండియన్ ఆశ్రమంలో ఉన్న గురువుగారు.

నీకు అంటే - ఆ ‘నా‘ ఎవరు ?

"నా అన్నది అది ఇగో లెవలో, సోల్ లెవెలో , స్పిరిట్యుయల్ లెవెలో ఆలోచించు...." అన్నారు.

ఇంతకీ ఏ లెవెల్ నాది?!

మిలియన్ డాలర్ల ఇల్లు, గౌరవనీయంగా కనబడ్డ పెళ్ళి నుంచి పారిపోయిన నేను, ఈ ప్రశ్నకు ఏమని సమాధానం చెప్పను?!

ఇవన్నీ ఆలోచించాలంటే... ఇంత దెబ్బ తగలాలా?!

నేను పెళ్ళి చేసుకున్న వ్యక్తి... అమెరికన్ సిటిజన్ అయివుండి, ఇంట్లో వాళ్ళు కన్ఫ్యూజ్ చేసిన ఇండియన్.... అమెరికన్ల ఎదుట ఇండియాను పొగుడుతాడు... కానీ ఇంట్లో గంటకు రెండుసార్లన్నా చెత్త ఇండియా... మీ ఇండియన్ బుద్దులు అని మాట్లాడతాడు.

అతను నా బాస్...."నిన్ను పదినెలలుగా చూస్తున్నాను.... ఇక్కడ కన్ఫ్యూస్డ్ ఇండియన్స్‌తో విసిగిపోయాను...." అంటూ సంవత్సరం తరువాత అతను పెళ్ళిగురించి మాట్లాడినప్పుడు నాలో ఏ "నా" పొంగిపోయింది?!

అతను డైవోర్సీ అని నాకు తెలుసు... డబ్బు, తెలివితేటలు, మంచి ఉద్యోగం ఉన్న అమ్మాయిని తన జీవితం నుంచి ఒదులుకుని "నన్ను" ఎంచుకున్నాడన్న విషయం నాలో "అహం" తృప్తిపరచి ఆడతనాన్ని ఛాలెంజ్ చేసిందా?!

అయిన వాళ్ళందరూ "ఒద్దు" అన్నారు.... అతను నాకన్నా చాలా పెద్దవాడవడం "మెచ్యూరిటీ" అనిపించింది....

"ఆ అమ్మాయి మీద నాకు కోపం లేదు... తన ప్రయారటీస్ వేరు..." అని డైవోర్స్ ఇచ్చిన అమ్మాయి పేరున హిందూ టెంపుల్‌లో అర్చనలు చేయించడం 'గొప్ప వ్యక్తిత్వమ'నిపించింది.

ఆఫీసులో చాలా ఆర్గనైజ్డ్‌గా శుభ్రం గురించి మాట్లాడే ఈ మనిషి మిగతా వాళ్ళకు చాదస్తంగా అనిపిస్తే, నాకు "ఫర్‌ఫెక్షనిస్ట్" అనిపించింది..

ఎవరు ఏం చెప్పినా వినదలచుకోలేదు... అందరికీ అతనిలో కనబడ్డ లోపాలు నాకు సరదాగా అనిపించింది.

అన్నయ్య మాత్రం చాలా సీరియస్‌గా మాట్లాడాడు. "అతనికి అన్ని విషయాల్లోనూ చాలా కన్ఫ్యూషన్ ఉన్నది చూశావా " ఏ షర్ట్ వేసుకోవాలో? ఏ బూట్లు కొనుక్కోవాలి? అని గంటలు గంటలు ఆలోచించి, ఆఖరికి ఏదో ఒకటి కొనుక్కుని ఇంటికివచ్చి "నాకు అస్సలు నచ్చలేదు, మీరు తొందరపెట్టారు కాబట్టి...." అనే రకం... అతను నాకు మంచి ఫ్రెండ్ కానీ, నీ భర్తగా ఊహించుకోలేకపోతున్నాను..." అన్నాడు

కానీ...

అతని బహుమతులు, రోజా పువ్వులు, నాకు కొన్ని రకరకాల టెడ్డీబేర్లు, చాక్‌లెట్లు, వేటి ఖరీదుగురించీ ఆలోచించకపోవడం మిడిల్ క్లాసు నుంచి, బడ్జెట్ గురించి ఆలోచించే కుటుంబం నుంచి వచ్చిన నాకు చాలా చాలా అద్భుతంగా అనిపించింది. ఇండియానుంచి అమెరికాకు ఫస్ట్‌క్లాస్ ఫ్లైట్‌లో రావడం అనే విషయం సామాన్యమైన మత్తు కాదు.

కానీ... అమెరికా వచ్చిన మూడు నెలల్లో తెలిసిన విషయం ఇతడూ అతిసామాన్యమైన మొగవాడే ....

తెలివిగల ఇతని మొదటి భార్య ఇతడిని "వదిలేసింది" అన్న మాట అహాన్ని బాధపెట్టింది కాబట్టి ఆడిన ఆట ఈ పెళ్ళి... చాలా ధైర్యం నటించే అతడికి విపరీతమైన అభద్రతాభావం.

"నీ అంతవాడు లేడు నాయనా" అనే అతని తల్లి ఇండియాలో చాలా చిన్న ఊళ్ళో ఉంది అతి సామాన్యురాలు, కొంచె మూర్ఖురాలు కూడా... ఆమె చేతిలో అతని రిమోట్ కంట్రోలు ఉంటుంది.

ఫోన్లో ఆవిడ చెపితే ఇక్కడ అమెరికాలో "లక్ష్మణ రేఖలు" గీయబడతాయి.

ఇలా అమెరికాలో ఉంటూ, ఇండియాలో ఉండే కుటుంబం చేతుల్లో రిమోట్ కంట్రోలు వదిలిపెట్టి వచ్చిన వాళ్ళు చాలా మంది కనపడ్డారు.....ఇందులో 90 శాతం మొగవాళ్ళే...

ఆడపిల్లలు దేశందాటిన తరవాత, స్వతంత్ర్యం, డాలర్లు - వీటి అర్థం తెలిసిన తరవాత ఇంక ఎవరి సలహా, సంప్రదింపు పట్టించుకోరు.

"అతణ్ణి నేను వదులుకున్నాను.... మాది లవ్ మారేజే కానీ, నా ఇంట్లో ఏకూర వండాలన్న ఆర్డరు ఇండియానుంచి రావడం నాకిష్టం లేదు.. మీరు ఏ మాత్రం తెలివి తేటలు ఉన్నా నాతో ముందుగా మాట్లాడవలసింది... " అన్నది అతడి మొదటి భార్య.

పెద్ద ఉద్యోగం, చాలా అందంగా ఉన్న ఆ అమ్మాయిని చూశాక 'తెలివిగల ఆడపిల్ల' అంటే అర్థం తెలిసింది నాకు... కానీ, ఈ అమ్మాయి కూడా నమ్మి మోసపోయిందిగా... అసలు ఏం కావాలి మాకు?! ఏమిటి వెతుకుతున్నాం?!

అదే అడిగాను ఆమెను.... సుచరిత ఆమె పేరు "తెలియదు... కానీ ఇది మాత్రం జీవితం కాదు.... ఇలా ఊపిరాడకుండా, ఎవరో గీసిన బొమ్మలా, లేదు కాని నేనుగా బ్రతకలేదు.....అది మాత్రం అర్థం అయింది" నాకు పిజ్జా సర్వ్ చేస్తూ అన్నది ఆమె.

"థాంక్స్" చెప్పి బయటపడ్డాను.

***

మొత్తానికి ఈ తెలిసీ తెలియని దేశంలో నేను ఒంటరి ప్రశ్ననై మిగిలిపోయాను.... వెనక్కి వెళ్ళి ఆ 'ప్రశ్నల' జీవితం అసలు ఊహించలేను... అదృష్టవశాత్తు నా బ్రతుకు నేను బ్రతకగలిగిన ఉద్యోగం ఉన్నది.

లాంగ్ వీకెండ్ అంటూ కొలీగ్స్ సరదాగా బైలుదేరారు. "ఎప్పుడు మన ఇండియా ఇలా డెవలప్ అవుతుందంటారు?" ఏ వెయ్యోసారో ఈ ప్రశ్న వింటూనో, అంటూనో ఉంటాము..

"ఇలా చచ్చినా డెవలప్ అవదు. మనవాళ్ళు ఎలా బ్రతికినా బ్రతుకే అనుకుంటారు.... ఇలాగే హాయిగా బ్రతకాలని అనుకోరు. అది యాటిట్యూడ్ ప్రాబ్లం..." అన్నది సుమిత.

బాబ్డ్ హెయిర్‌తో ఎప్పుడూ నవ్వుతూ చలాకీగా ఉండే సుమిత ఎప్పుడో పూర్తిగా అమెరికన్ అయిపోయింది. "మీవాళ్ళకు రకారం రాదా? మీ పేరులో అది మర్చిపోయారు..... సుమిత కాదు సుమిత్ర" ఏడిపిస్తాడు రాజా.

అలా ఎందుకు అనుకోవాలి? ఎలా ఉన్నా మన దేశం మనదేశమే.." రాజా అన్నాడు.

ఇద్దరు పిల్లలు, భార్య ఉన్న రాజా "డాలర్ల కోసం ఈ దేశం వచ్చాము..... బాగా సంపాదించుకుని మన దేశం వెళ్ళిపోదాం..." అన్న ఆలోచన అతనిది. అతని మాటలు వాళ్ళ అమ్మగారు కాల్చే మొక్కజొన్నపొత్తులు, కొరివికారం చుట్టూ తిరుగుతూ ఉంటాయి.

ఆవిడకు ఎంత జబ్బు చేసినా, "ఆచార్లు గారి మందు, కషాయం చాలులేరా?" అని పల్లెటూర్లో, గేదెల్ని పెట్టుకుని, సంవత్సరానికి ఐదారు ముతకచీరలతో సరిపెట్టుకుని బ్రతికే ఆ అమ్మలు రాజాలాంటి చాలామందికి రక్షణ వలయాలు... వాళ్ళకు ఏం కావాలో ఏది ఇష్టమో ఈ అమెరికా పిల్లలకు పట్టదు... వీళ్ళు తీసుకువెళ్ళే ప్రతి బహుమతీ వాళ్ళకు తప్పకుండా నచ్చుతుందని వీళ్ళ ఉద్దేశ్యం.... ప్రతి బాంధవ్యాన్ని ఖరీదు కట్టి వాడుకునే కొత్త జనరేషన్ వాడు రాజా.

"నువ్వేం మాట్లాడవేం శశిధర్?" అన్నది నమిత. హుందాగా ఉండే శశిధర్ సన్నగా నవ్వాడు. అతడు ఫోటోలు తీస్తూ బిజీగా ఉన్నాడు.

"గత పదిహేను సంవత్సరాలుగా ఇండియాలో చాలా మార్పు వచ్చింది. అక్కడ ఇవ్వాళ 57% యువత ఉన్నది. వీళ్ళు తలుచుకుంటే మార్పు ఆగాలన్నా ఆగదు... యూత్ పాలిటిక్స్‌ను డామినేట్ చెయ్యాలి...

ఇక్కడ తెలివిగా కమ్యూనికేషన్, బ్రెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ ప్లేసెస్ డెవలప్ చేసినట్లు చేస్తే చాలు.... మనకున్నది వేల సంవత్సరాల సంస్కృతి సంపద!..! - వీళ్ళు రెండువందల సంవత్సరాల చరిత్రను బిజినెస్ చేసేశారు.

మనవాళ్ళు కూడా రొటీన్ జీవితం నుంచీ బయటపడి, సినిమా, టి.వి ల నుంచీ దూరంగా ప్రకృతికి దగ్గరగా వెళ్ళగలిగే అవకాశాలు కల్పిస్తే మన దేశంలోనూ టూరిజం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుంది. "

అతడి వంక విచిత్రంగా చూశాను... చాలా సీరియస్‌గా ఉండే ఇతను తక్కువ మాట్లాడి ఎక్కువ చెపుతాడు...

సాయంత్రం దూరంగా కనబడుతున్న కొండల్ని చూస్తూ చిరు చలిలో నేను సుమిత కబుర్లు చెప్పుకుంటున్నాము....

ఇండియా అమ్మాయిలను పెళ్ళి పేరుతో తీసుకు వచ్చి నానా బాధలు పెట్టేవాళ్ళను గురించి మాట్లాడుకుంటున్నాము.

కాసేపటికి రాజా, శశి వచ్చి కలిసారు. "ఎంత సేపూ ఆడపిల్లల నరకాలు మాట్లాడతారు.. మొగపిల్లల సమస్యలు లేవనా?!" అన్నాడు రాజా....

"అమ్మాయిపట్ల అంతో ఇంతో సానుభూతి ఉంటుంది. మంచిగా, హాయిగా సంసారం చేద్దామనుకునే అబ్బాయి మంచితనాన్ని అసమర్థతగా చిత్రీకరించి వాడుకునే వాళ్ళ కథలు, ముఖ్యంగా మన ఇండియన్ అమ్మాయిల కథలు తెలుసా మీకు?!" సీరియస్‌గా అన్నాడు శశి.... అతని గొంతులో పదును.

చుట్టూ వాతావరణం మరింత చల్లగా అనిపించింది. "అమెరికాలో అబ్బాయిని పెళ్ళి చేసుకుని, వీసా తెప్పించుకుని, అతని టికెట్ మీద అమెరికా వచ్చింది ఒక అమ్మాయి బోలెడన్ని కలలతో, రోజాపువ్వులతో రిసీవ్ చేసుకోడానికి వచ్చిన అతడితో.. ఇదుగో ఇతను నా బాయ్ ఫ్రెండ్. వీసా కోసం మీతో పెళ్ళికి ఒప్పుకున్నాను సారీ... అని అతనితో వెళ్ళిపోయిన అమ్మాయి గురించి ఏమని చెప్పాలి? ఇలా మోసపోయిన అమెరికా అబ్బాయిల కథలు తెలుసా మీకు?!"

చీకటి మరింత చిక్కపడింది... అతని గొంతులో పదును...

చాలా ఇబ్బందిగా ఉంది.

"టీ తాగుదాం కొంచెం... " సుమిత కదిలింది ....

విషయం మార్చి ఏదో మాట్లాడుకుంటున్నాం కానీ, పడుకునే ముందు సుమీని నేను అడిగాను..

"ఎవరి కథ అది సుమిత్రా ! కొంప దీసి ఇతని కథ కాదు కదా?!"

"చెప్పలేం... అడిగితే బాగుండదు కదా! గుడ్‌నైట్..." పడుకుంది సుమిత...

"ఏమిటి మన హోస్ట్ మిసెస్ కాళి 'ఇక్కడి వాళ్ళు ఇండియా నుంచి వచ్చారు.. '. అంటుంది. కొంపదీసి నేటివ్ అమెరికన్స్‌ను రెడ్ ఇండియన్స్ అంటారు. అలా ఏదన్నా కథ చెపుతోందంటావా?! అన్నది సుమిత

"ఏమో... కానీ, ఇక్కడ గ్రాండ్ కేనియన్‌లో శివ, విష్ణు, బ్రహ్మ ... బుద్ధ శాంక్చ్యుయరీ ఇట్లాంటి పేర్లు ఉంటాయి... ఇక్కడ నేటివ్ అమెరికన్స్ చాలా ప్రార్థనలు చేసేవారట.. వాళ్ళు భూమిని గౌరవించారు హింసించలేదు.... వారి ఎనర్జీ ఈ భూమిని ఇంత సంపదతో, సౌందర్యంతో ఉంచుతుందని నమ్మేవారున్నారు..." శశి అన్నాడు..

ఎవరెవరికి ఏమేమి కావాలో చేసి ఇచ్చింది మిసెస్ కాళి... పాన్‌కేక్స్ ఆవిడ స్పెషాలిటీ...

ఆవిడ మాటల్లో చాలా భావుకత ఉన్నది. "మీ గంగానదిలా, కొరలాడో నదీ దేవత భగవంతుడిని అర్థించి ఈ ప్రదేశాన్ని చాలా అద్భుతంగా తయారు చేసిందట... కొండల్ని మలుస్తూ, రంగుల్ని అలుముతూ, కదులుతూ జలజలా పారుతూ ఎన్ని రకాల శిల్ప సంపదను మలిచింది... పదహారు వందల సంవత్సరాలు దాటిన ఈ మహాద్భుత శిలావిష్కరణ ఎప్పటికప్పుడు కొత్తే..."

చిన్న చిన్న మాటలతోనే మా ముందు ఒక సౌందర్యదేవత అయిన కొలరాడో మిల మిల మెరిసే తన నీటి కుంచెలతో గ్రాండ్ కానియన్‌ను సృష్టించడం చూపించిందా ఆమె - అనిపించింది...

"మీకు నమ్మకముంటే గ్రాండ్ కానియన్ దగ్గర మెడిటేట్ చేసి, మీలో భయాన్ని, దురాశను విసిరేసి రండి...." చెపుతున్నారు కాళి..

"పేపర్ ఉన్నదా?" అడిగాడు రాజా.

"ఈ పుస్తకం చూశారా? ఎన్ హార్ట్ టాలీ ... రాసిన న్యూ ఎర్త్... ఇందులో మానసిక ఆవేదనతో మనిషి బాధా శరీరాన్ని సృష్టించుకుంటాడని (pain body) చెపుతారు రచయిత. మనుష్యులకు అది ఎక్కువైనప్పుడు మన చుట్టూ ఉండే జీవితాల మీద కూడా దాని ప్రభావం ఉంటుంది. ప్రపంచం అంతా ఈ బాధ వ్యాపిస్తుంది. నేను మీడియాకు దూరంగా ఉంటాను ఎందుకో తెలుసా? సెన్సేషనలిజం కోసరం పేపరు కానీ టివీ కానీ నెగిటివ్ నెస్‌ను ఎక్కువ మన లివింగ్ రూంలో వ్యాపింపచేస్తారు... సారీ ఇక్కడ నో పేపర్..." అన్నారావిడ నవ్వుతూ ...

బ్రెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్‌లో వాళ్ళు ఇళ్ళు చాలా అందంగా అలంకరిస్తారు... అన్ని అవసరాలు గమనిస్తారు. వాళ్ళ కుటుంబం అంతా మనతో కూర్చుని బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటారు.. హోటల్‌లాగా అనిపించదు..

"మన పూటకూళ్ళమ్మ ఇల్లు అనుకోరాదా?" అన్నాడు రాజా వెంటనే..." బ్రేక్ ఫాస్ట్ పెడతారు. డబ్బులు తీసుకుంటారు... "

"అలా ఆలోచించకు రాజా.. డబ్బు ఒక్కటే కాదు... ప్రతి కుటుంబం తీసుకునే శ్రద్ధ, వీళ్ళ టేస్ట్.. వాళ్ళ సంస్కారం, వాళ్ళ కల్చరు - ఇవేవీ గమనించవా?!" కేకలేశాడు శశి.

"ఊరికే అలా ఉన్నారా? డబ్బులు ఉన్నాయిగా? " మొండిగా అన్నాడు రాజా.

"ఇతడిని మార్చలేం... ప్రయత్నం కూడా చెయ్యకు శశీ...!" అంది సుమిత ఒళ్ళుమండి.

"ఇంతకీ మీరు చెప్పే ఈ బాధా శరీరాన్ని ఎలా ఆరోగ్యవంతం చెయ్యాలంటారు?!" కుతూహలంగా ఉంది నాకు.

"ప్రకృతికి దగ్గరవ్వండి.... సంచలనాత్మకమైన జీవితానికి దూరంగా కనీసం కొంతకాలం ఉండండి. మీ ఎమోషనల్ బాడీ నుంచి మీ పెయిన్ బాడీని విడదీయటానికి ప్రయత్నం చెయ్యండి. నెగటివ్‌గా చలింపచేసే విషయాలు, బాధాకరమైన విషయాలు - వాటికి దూరంగా ఉండండి.... దీనివలన మనశరీరాలే కాదు, ప్లానిటరీ పెయిన్ బాడీ (విశ్వం తాలూకు బాధాశరీరాన్ని) కూడా మెల్లగా బాగు చెయ్యగలుగుతాము... "

కాళీగారి గొంతులో ఏదో సున్నితమైన అదిలింపు.... తను మాట్లాడే విషయం మీద గౌరవం, నమ్మకం ఉండే వ్యక్తి గొంతులో ఉండే కంపల్షన్ అది.

"అందుకే మా ఋషులు, మునులు అలా అడవులు, హిమాలయాలు పట్టుకు వెళ్ళిపోయేవారు... "వెంటనే అన్నాడు రాజా.

"ఇతడిని మార్చలేము బాబోయ్" తలకాయ పట్టుకుంది సుమిత.

"మరి మీరెందుకు చెయ్యరు?" నవ్వుతూ అడిగారు కాళి.

"మేము సామాన్యులం కదా! " నవ్వుతూ అన్నాడు రాజా.

"సామాన్యులు ఇలా చేస్తే అసామాన్యులు అవుతారు" నవ్వారు కాళి.

"గ్రాండ్ కానియన్ గురించి చెప్పరా!?" అడిగింది సుమిత

"ఇది ప్రపంచ వింతల్లో ఒకటి. 1919 లో ప్రెసిడెంట్ ఉడ్రోవిల్సన్ వల్ల దీని ప్రఖ్యాతి పెరిగింది.... ఎన్ని వేల సంవత్సరాల క్రితం నుంచి ఉన్నా ఈ అద్భుతం ఏమిస్తుంది అంటే అనుభవ సాక్షాత్కారం. ఎన్నిసార్లు చూసినా ఎప్పటికప్పుడే కొత్త అనుభూతి... రంగు, రుచి,

వాసన... వీటికన్ని దృష్టి... ఇవన్నీ మనలోని అంతర్లీనమైన అనుభూతిని కదిలిస్తుంది. ఈ శిలాస్పందనలకు ప్రత్యేకమైన శిలా శరీరం, కాంతి, అనుభూతి ఉంటుంది. మౌనంగా గ్రాండ్ కానియన్ ముందు నిలబడండి. చాలు... ఎవరూ చెప్పలేని చాలా విషయాలు అర్థమౌతాయి..."

"ఒక్క ముక్క అర్థమైతే ఒట్టు... ఈవిడ అద్భుతమైన బ్రేక్‌ఫాస్ట్ చేసింది... థ్యాంక్స్... కానీ ఏదో కొండ రాళ్ళ గురించి ఇంత సుత్తేమిటని?!

"రాజా... నువ్వు మాట్లాడటం లేదు... వాగుతున్నావు.. " పద సుమిత్ర అరిచింది.

దాదాపు ఆరువందలమంది ఒక్కసారి బయలుదేరారు. రైల్లో ప్రతి ఒక్కళ్ళనీ చిరునవ్వుతో ఆహ్వానిస్తున్నారు. రైల్వే ఆఫీసర్లు ఎక్కడ చూసిన సావరిన్ షాపులు...

ఎంత పెద్ద రైలు.. ఎక్కడికీ ప్రయాణం?! ఏదో దిగులు నా గుండెల్లో.... స్థంభానికి ఆనుకుని నిలబడి చూస్తున్నాను.. ***మన మనస్సులో దిగులు ఉంటే చుట్టూ ఎంత ఆనందం ఉన్నా మనం విడిగా ఉన్నట్లే అనిపిస్తుంది...*** వీళ్ళంతా ఇంత ఆనందంగా ఉన్నారేం?! నాకు ఏమైంది?! అన్న బాధ... "వై మీ?" - నాకే ఎందుకు ఇలా అయింది?!

"అలా నిలబడిపోయారేం పదండి ..." శశి భుజం మీద చెయ్యివేసి అదిలించాడు.

ఉలిక్కిపడి చూశాను. అతని కళ్ళల్లో.. ఏదోచూడాలన్న ప్రయత్నం. నా కళ్ళల్లోకి సుటిగా చూస్తున్నాడు.. చెయ్యి అందించి రైలులోకి లాగాడు...

"ఏమైపోయావు? ఇందాకటినుంచి వెతుకుతున్నాం.." కేకలేసింది సుమిత.

పి.హెచ్.డి చేసిన నేటివ్ అమెరికన్, రైల్లో వారి జానపదాలు పాడాడు. "ఈ పాట హీలింగ్ చేస్తుంది..." అని పాడుతుంటే చాలామంది నిశ్శబ్ధమైపోయి, నిద్రపోయారు... రైలు దిగి, మెట్లు ఎక్కి ఒక్కసారి ఆ దృశ్యాన్ని చూసి ఆగిపోయారు ఒక మహాద్భుత ప్రపంచ ఆవిష్కరణ... ఏదో శక్తిపాతం జరుగుతున్నట్లుగా ... విద్యుత్ శక్తి అయిస్కాంతం కలిసి ప్రతిస్థంభిస్తూ, మళ్ళీ ప్రవహిస్తున్నాయి...

ఇప్పుడు చూసినట్లు మరికాసేపటికి ఉండదా దృశ్యం.... ఎన్ని రంగులు, ఎన్ని కళలు, కాంతుల కలయికల ఆస్వాదనం... కాంతి పుంజాల విచిత్ర పరివర్తనా నాట్యం... ఏమిటిది? కలా, నిజమా?!

నిజమే బ్రహ్మ, విష్ణు, శివపేరు... బౌద్ధ ఆరామం, ఐస్ గుడి... ఏమిటేమిటో దర్శనాలు.... సన్నటి వర్షం... నీరెండ...

నిశ్చలమై, నిర్మలమైన, మౌనమైన మనసు మందిరంలో ఏదో కాంతి రేఖల స్పందన... కరిగిన గుండె కన్నీరుగా.. దేనికీ సంబంధం లేనట్లుండే నిర్లిప్తతా.. నువ్వు ఎక్కడికి పారిపోయావు?!

ఏదో చలనం... ఎక్కడో మనస్సులో సంచలనం.. చినుకులు పెద్దవై... వర్షంగా మారి.. ఒక్కసారి చుట్టూ చూశాను ఎవరూ లేరు... అతను తప్ప.

నిశ్చలంగా చేతులు కట్టుకుని చూస్తున్నాడు శశి....

"ఏయ్... తడిసిపోతున్నారు... షెల్టర్‌లోకి రండి.. అని అరుస్తోంది సుమిత. పక్కన రాజా శాండ్‌విచ్ తింటున్నాడు.

"వెళదామా?" సున్నితంగా అడిగాడు శశి...

"ఊ.. కాళిగారు చెప్పినట్లు అహం, భయం ఆ మధ్యలోకి విసిరి రేసి బుద్ధిగా కళ్ళుమూసుకుని ప్రార్థించాను. కలలో తేలిపోతున్నట్లు అడుగులు వేశాను... తపతపకొట్టుకుంటున్న నీటి మడుగుల్లో... అతని అడుగులో అడుగు వేస్తూ... అదొక అనుభూతి...

"ఏమిటి శశీ! మీకేమన్నా పిచ్చా! ఇద్దరూ అలా నిలబడిపోయారు?! ఇంకాసేపుంటే వచ్చే తుఫానుగాలికి ఇద్దరూ ఆ కొండలలోకి వెళ్ళిపోయుండేవారు.."

"అవునా! ఎంత బాగుండేదో... " నేను, శశి ఒకటేసారి అన్నాము...

ఉలిక్కిపడి అతణ్ణి చూశాను.. సన్నగా నవ్వాడు. నాలో జలదరింపు...

వేడివేడిగా టీ తాగుతూ... అల్లరి చేస్తూ నాలో నిర్లిప్తత నిజంగా ఆ కొండల్లోకి జారిపోయింది..

ఏమిటి కథ?! అల్లరిగా అడిగింది సుమిత "ఏమిటీ? ఇంకా నయం...." అటు తిరిగి పడుకుంటూ అన్నాను. అనుభూతుల అల్లరి చాలా సున్నితంగా తీయగా ఉంటుంది. పంచుకుంటే పారిపోతుందేమోనని దిండును గట్టిగా కౌగిలించుకుని పడుకున్నాను...

"సెడోనా వెళదామా?" శశి ఫుల్ హాండ్స్ ముడుచుకుంటూ అడిగాడు.

"ఒద్దు.. నేను రాను.. నాకొక ఫ్రెండ్ వస్తున్నారు..." చెప్పేసింది సుమిత.

"అమ్మో! అవన్నీ రాళ్ళూ రప్పలూ.. నా వల్ల కాదు... అసలు గ్రాండ్‌కానియనే...."

"ఆపు తండ్రీ. నీ అభిప్రాయాలు ఒద్దు. మాకు ఏర్పడ్డ మంచి అభిప్రాయాలు పోగొట్టకు.. మరి ఏం చేస్తావు"

"నేనేదో చేస్తాను.... నన్ను ఒదిలెయ్యండి మంచి బ్రేక్ ఫాస్ట్ కొట్టి ముందు నిద్రపోతాను.. సరేనా?" అన్నాడు రాజా.

"గుడ్. కారు తీస్తాను.. వచ్చెయ్యండి..." అన్నాడు శశి

"నా అభిప్రాయం అడిగే పనిలేదా?" కారులో కూర్చుంటూ నవ్వుతూ చిలిపిగా చూస్తూ అడిగాను..

"లేదు... మీకు తప్పకుండా నచ్చుతుంది..." కారు రివర్స్ తీస్తూ అన్నాడు శశి.

"అక్కడ చూడండి శశీ!" చటుక్కున అతని చెయ్యిపట్టుకున్నాను....

ఇంత ఎనర్జీ ఏమీటి?! ఈ ఎట్టటి కొండలు ఇలా ఎలా స్పందిస్తున్నాయి!!

పరుగెత్తాను.. అపూర్వమై.. ఉలి ఎరగని శిల్పనిక్షిప్తాలు.. కెమేరాకు అందడం లేదు... ఒక్క క్షణానికి మరొక క్షణానికి ఎంత మార్పు.

కరాళ దంష్ట్ర.. ఏదో పద్యం... నరసింహ స్వరూపం... మహా నాగం...

"శశీ... అటుచూడండి... ముందు మూర్తిగా... ఆ తరువాత రూపశిల్పంగా... ఆ తరువాత.. ఆ తరువాత చలనరూపంగా... మనమీదకి వస్తున్న ఈ ఎనర్జీ ఏమిటిది?!"

ఇదంతా ఏదో దేవతా దర్శనంలాగా ఉన్నది... ఇక్కడ ఏదో మహాద్భుత విస్తృత ప్రపంచం... ఇదేదో నాగలోకానికి దారి ఆవిష్కృతమౌతోందేమో...

ఎంతోమంది మహాఋషులు, అద్భుత జీవులు.. ఇక్కడ అదృశ్యరూపంలో తపస్సు చేసుకుంటున్నారా... ఏదో జరిగిపోతోంది నాలో..

ఎక్కడనుంచో ఏదో ప్రతిస్పందన.. ఏదో లోకాలతో కాంటాక్ట్... ఏదో కదలిక!

సర్వప్రపంచమా! కదలిపో..

సడోనా... నిజం... మిగతాదంతా అబద్ధం.....

వర్షంలో కొండ చరియలు జారిపోతున్నాయి.. గభాలున పట్టుకున్నాడు శశి నన్ను.

నా ఊహలన్నీ మాట్లాడుతున్నాయి. నేను ఇలా స్పందించగలనని నాకే తెలియదు...

శరీరానికి అస్థిపంజరానికి సంబంధించని మరో శరీరంలో ఈ సడోనా ఇమిడిపోయింది....

మాట్లాడుతూనే ఉన్నాను...

వర్షంలో... చుట్టూ జరుగుతున్న ఆ అద్భుత ఆవిష్కరణలో అదొక మరో ప్రపంచం...

మౌనంగా వింటున్నాడు శశి.... ఆశ్చర్యంగా చూస్తున్నాడు. అతని కళ్ళల్లో ఏదో మెరుపు...

"మీరు ఇంతకుముందే సడోనా గురించి విన్నారా?!" కుతూహలంగా అడిగాడు శశి.

"లేదే.. నాకేం తెలియదు.. నాకేమైపోతోందో నాకు తెలియడం లేదు... ఏం.." అనుమానంగా అడిగాను.

"దటీజ్ ఇంటరెస్టింగ్.... చీకటి పడింది... రండి వెనక్కి వెళదాం..."

నేను నా మత్తులోంచి తిరిగి చూసేటప్పటికి చుట్టూ చీకటి....

"అమ్మో... మళ్ళీ ఇంత దూరం వెనక్కి ఈ కొండల్లో నుంచి వెళ్ళగలమా!" భయంగా అన్నాను.

"ఒద్దు.. సడోనాలో బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ ప్లేస్ బుక్ చేశాను... మళ్ళీ రేపు ఇక్కడకే వద్దాం...."

"ఎప్పుడు బుక్ చేశారు?...." సీట్ బెల్ట్ వేసుకుంటూ అడిగాను.

"ఇందాక మీరు మీ మైకంలో మరో ప్రపంచంలో ఉండగా..." నవ్వుతూ కారు స్టార్ట్ చేశాడతను...

చాలా చాలా అద్భుతంగా ఉన్నది ఆ బ్రెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ ప్లేసు. చుట్టూ కిటికీలలోనుంచి సడోనా సౌందర్యం మనని ముట్టుకుని స్పందింపచేస్తుంది.. ఆ గాలే వేరు....

"న్యూ ఏజ్ స్పిరుచువల్ మూమెంటు గురించి తెలిసినవారికి సడోనా ఒక వరం.. ఇక్కడ భూమిలోనే ఒక కొత్త అనుభూతి ఉంది. మీకు ఓర్టెక్సెస్ గురించి తెలుసా?! అవి ఎనర్జీ ఫీల్డ్స్... పాజిటివ్ డివైన్ ఎనర్జీ ఫీల్డ్స్.... మీ ఇండియాలో చాలాగొప్ప గొప్ప గుడులన్నీ అలాంటి ఫీల్డ్స్ పైనా కట్టారని విన్నాను. నాకు తెలిసి మీ తిరువణ్ణామలై, తిరుపతి, కన్యాకుమారి, హిమాలయాలు, మానస సరోవర్... ఇవన్నీ ఇట్లాంటి ఓర్టెక్స్ ప్రదేశాలు..." రాబర్ట్ అనే హీలర్ ఇలా చాలా చెప్పారు.

"ఇక్కడ ఏం జరుగుతుందంటారు?" మరొక అతిథి అడిగారు.

"A spiritual boost.... ఒక ఆధ్యాత్మికమైన ఎదుగుదల, మార్పు, హీలింగ్, చాలా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక దశల్లో గొప్ప మార్పు... చైతన్యం...."

"ఇది అందరికీ జరుగుతుందంటారా?" కుతూహలంగా అడిగాడు శశి...

"అలా చెప్పలేము... కొంతమంది కేవలం టూరిస్ట్‌గా వెళ్ళిపోతారు... కొంతమందిలో అద్భుతమైన జీవచైతన్యం నిద్రలేవచ్చు... నాలామంది సడోనాను టూరిస్ట్‌గా చూడడానికి వచ్చి, న్యూయార్క్‌లో మిలియన్ డాలర్ల జీవితాన్ని ఒదిలేసుకుని ఇక్కడ సెటిల్ అయిపోయిన వాళ్ళు ఉన్నారు... ఎవరి అనుభవం వాళ్ళదే ..."

ఇంకా వాళ్ళు చాలా చాలా మాట్లాడుకుంటున్నారు. "ఈ ఎనర్జీలో మాస్క్యులైన్ ఎనర్జీ, ఫెమినైన్ ఎనర్జీ, న్యూట్రల్ ఎనర్జీ ఇలా చాలా తేడాలు. డేజింగ్‌తో ఇక్కడ ఎనర్జీ ఫీల్డ్స్ తిరగడం చూడగలగడం, వీటి కోసరం చాలా అధునాతనమైన ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్... "

ఇవన్నీ వింటూ చూస్తూ ఆశ్చర్యపోతున్నాను నేను.... నానో టెక్నాలజీ, ఎలక్ట్రో మాగ్నెటిక్ ఎనర్జీ ఫీల్డ్స్... నాకు తెలియని భాష, చాలా మాట్లాడుకుంటున్నారు.

శశికి వీటి గురించి చాలా తెలుసనుకుంటాను..... చాలా పనికి వచ్చే ప్రశ్నలు వేస్తున్నారు.....

రాత్రి చలికి ఒణుకుతూ, ఏదో లోకాల్లో ఉన్న నన్ను పాపాయిని పొదవి పట్టుకున్నట్లు గుండెల్లో దాచుకున్న మొగవాడు వేరు... ఇతనిలో ఈ మేధావి వేరు...

వెలుతురులో, విషయం తెలిసిన గైడ్‌తో, మరి కొంతమంది టూరిస్ట్‌లతో సెడోనాలో తిరిగాం... చాలా కొండలు, గుట్టలు ఎక్కుతూ కెథిడ్రెల్ రాక్ ఎనర్జీ ఒట్రెక్స్ దగ్గర మళ్ళీ విపరీతమైన సంచలనానికి గురి అయ్యాను.

"ఇది ఫెమినైన్ ఒర్టెక్స్.... ఇక్కడ ధ్యాన్యంలో కూర్చుంటే దయ, ప్రేమ, ఓర్పు మనలో అంతర్లీనంగా ఉండే స్థితి నుంచి నిద్రలేస్తాయి... మెడిటేట్ చెయ్యండి..." గైడ్ చెప్పాడు.

అందరం కాసేపు కళ్ళు మూసుకుని కూర్చున్నాము... నేను ఏదో మత్తులో ఉన్నాను.... అంతర్గత శరీరంలో, అనుభూతుల స్పందన...

ఆ తరువాత ఒక్కొక్కరు ఒక్కొక్క అభిప్రాయం వెలిబుచ్చారు.

"నాలో ఏదో కరెంటు పాకినట్లుంది..."

"నాకు విపరీతంగా ఏడవాలనిపించింది..."

"నాకు ఏమీ అనిపించలేదు.... ఎప్పుడు కళ్ళు, తెరుద్దామా! అనిపించింది..."

"ఈ ప్రపంచానికి నేనే తల్లిననిపించింది..." ఇలా ఎవరి అనుభూతులు వాళ్ళు చెపుతున్నారు.. ఒకటి మాత్రం నిజం... అమెరికాలో ఎవరి భావన వాళ్ళు నిజంగా చెపుతారు.. ఇండియాలో లాగా మరొకరు వినాలని, మెచ్చుకోవాలని కనిపించి కథలు, పురాణాలు చెప్పరు... నేను ప్రత్యేకమైన వ్యక్తినని అనుకోరేమోనన్న ఇన్‌సెక్యూరిటీ వీళ్ళకు లేదు.

"ఇంతకీ ఈ దయ, ప్రేమ, కంపాషన్ వగైరా అన్నీ ఫెమినైన్ ఎనర్జీ దగ్గర నిద్రలేవడానికి కారణం ఇవన్నీ ఆడవాళ్ళ లక్షణాలనా?! నేను మూడు పెళ్ళిళ్ళు చేసుకున్నాను.... ఎవరిలోనూ నాకు ఈ లక్షణాలు కనబడలేదే?.." అన్నాడు డెబ్బై ఏళ్ళ టూరిస్ట్....

"ఒక్క క్రోమోజోమ్ తేడాలో మొగ ఆడ తేలిపోతారు... ఆడవాళ్ళలో ఫీమేల్, ఉమెన్, లేడీ అని మూడు రకాలు ఉంటారు... ఇవన్నీ లేడీకి ఉండే లక్షణాలు... మీరు అలాంటి వాళ్ళను వెతకలేదేమో. "నవ్వుతూ జవాబిచ్చాడు మరొక టూరిస్ట్....

"అయ్యుంటుంది.. ఈసారి ప్రయత్నిస్తాను...." అన్నాడు ఆ డెబ్బై ఏళ్ళ టూరిస్ట్.

తిరిగి వచ్చేదారంతా ముందు ఘనీభవించిన మౌనంతో, మాట్లాడే మౌనంతో, స్పందించే మౌనంతో కొండదిగిన నేను, శశి... ఆ తరువాత ప్రవాహంలాంటి మాటలలోకి దిగిపోయాము....

దగ్గరతనం రాగానే ముందు మాట్లాడేది బాల్యం గురించి... అమ్మగురించి.... ఎన్నో జ్ఞాపకాలు...!

మళ్ళీ విలియమ్స్ దగ్గరకు వచ్చేటప్పటికి సుమిత తన స్నేహితులతో వెళ్ళిపోయింది. ఏదో బిల్లు సెటిల్ మెంటు మీరు చెయ్యండని రాజా వెళ్ళిపోయాడు...

నేను, శశి వెనక్కి తిరిగి నా ఫ్లాట్‌కు వచ్చాము... మా ఇద్దరి మధ్య మాటలకు, పత్రాలకు సంబంధించని కమిట్‌మెంటు ఏదో జరిగిపోయింది....

వారంరోజులు... ఇద్దరం శలవు పెట్టాం.. ఒకరికొకరం దగ్గరగా....

అతడికి చాలా శుభ్రం ఎక్కువ. డిసిప్లిన్ ఎక్కువ. నాకు చాలా బద్ధకం. అమెరికన్ జీవితానికి అలవాటుపడ్డ నాకు, అమెరికన్ డిసిప్లిన్ అంతగా నచ్చదు. నా అలవాట్లు నాకు చాలా పోలేదు. ఇండియాలో ఉంటే అమ్మ చేత చచ్చేట్లు తిట్లు తినే అలవాట్లన్నీ ఇక్కడ స్వతంత్ర్యం పేరుతో చెల్లుబడి చేసుకునే రకాన్ని నేను.

"అరె... ఆ కప్పు ఏమిటి? శుభ్రంగా లేదు.." శశి అన్నాడు.

"ఆఁ ! డిష్ వాషర్లో పడెయ్యచ్చులే.. నాకు ఇంట్లాంటి చిన్న చిన్న విషయాలు పట్టిచ్చుకోవాలనిపించదు..." నిజాయితీగా చెప్పాను.... "ప్రేమ ఎదుటి మనిషి మీద ఒక రకమైన అధికారాన్నీ, మన ఇష్టాఇష్టాలన్నీ ఆలోచించుకోకుండా మాట్లాడచ్చు అన్న ధైర్యాన్ని ఇస్తుందేమో..."

"అవును.... ఇంప్రెస్ చెయ్యడానికి నటించద్దు.... కానీ... నీలో కనిపించే couldn't care less attitude మంచిది కాదు..." చనువుగా అన్నాడు.

"అంటే!..."

"అంటే.....ఆఁ! ఏం జరిగితే ఏం.... నాకేం లెక్కలేదు అన్నట్లు ఉండడం..."

"దీనివల్ల నీకేమైనా బాధా?" ఎర్రగా చూస్తూ అడిగాను.

"నాకుకాదు.... నీకే బాధ. నీ మీద నీకు నమ్మకం పోతుంది... ప్రారంభించిన పని నిజాయితీగా పూర్తి చెయ్యలేవు.... Means are better than ends అంటాడు H.G.Wells ఫలితం (ఎండ్స్) తెలియదు... పద్ధతి (మీన్స్) మీద గౌరవం లేదు...?"

చురుగ్గా తగిలింది ఆ మాట. నేను పి.హెచ్.డి ఆపేశానని ఇలా అంటున్నాడా?!

అడిగాను.

"అదొక్కటే కాదు.... పోనీ..... ఎందుకు ఆపినట్లు?"

"ఆఁ! నా ముఖం... అది ఎలా వస్తుందో తెలిసి గౌరవం పోయింది"

"అది నీకు అనవసరం... నువ్వెందుకు బాధ్యత నుంచి తప్పించుకుంటున్నావు అని?!

నాకు చిర్రెత్తింది.

ఇలా బోనులో నిలబెట్టి మాట్లాడేవాళ్ళను నేను భరించలేను... కానీ ఇతను శశి.... ఇప్పటికే ఇతను తప్పించుకోలేని బంధంలా అనిపిస్తున్నాడు.

ఇట్లాంటి చీపురుముళ్ళులాంటివి గుచ్చుకోకపోయినా, ఇబ్బంది పెట్టేవి మా మధ్య చాలానే జరుగుతున్నాయి. నాకు కచ్చగా అనిపించేదేమిటంటే

ఒక్కసారన్నా అతన్ని తప్పు అని పట్టుకోవాలంటే దొరకడే?!

"నేను బహుశ ఇంక ఉద్యోగం చెయ్యలేనేమో... " ఆటంబాంబులాంటి మాట అన్నాడు నా వంక చూస్తూ

"ఎందుకని?" భయంగా, ఆశ్చర్యంగా అడిగాను.

"అది అంతే......" అక్కడనుంచి అతను లేచి వెళ్ళిపోయాడు....

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు... ఎందుకిలా అంటున్నాడు?! ఖర్మకాలి మొత్తం, మీద నా మీద ఆధారపడిపోవాలనుకుంటున్నాడా?! అట్లాంటి మనిషి కాదే?!

టి.వీ చూశాను... టీ తాగాను... రాత్రంతా అలజడి మర్నాటి నుంచి నాకు తెలియకుండానే ఆ విషయం గురించి మాట్లాడుతున్నాను...

"ఎందుకు నా ఉద్యోగం గురించే మాట్లాడతావు? అదేదో చాలా ముఖ్యమైన విషయంలా.... " విసుగ్గా అన్నాడు శశి....

ముఖ్యవిషయం కాదా! ఈ అమెరికాలో ఈ క్రెడిట్ కార్డ్స్ అడవిలో.... ఏమనుకుంటున్నాడు ఇతను?! అతి తెలివా?! అయినా - డబ్బు ఎంత ముఖ్యం! రాజాను అయితే సులభంగా ఎక్కిరిస్తాను కానీ, అందరిలో చిన్న రాజా ఉంటాడేమో...

నాలో నేను మాట్లాడుకుంటున్నాను..... నా ప్రవర్తనలో ఏదో అభద్రత..... నాలో ఏదో దిగులు.... వారం తరువాత..... అతడు వెళ్ళిపోయాడు ఒక ఉత్తరం, గ్రీటింగ్ కార్డ్ పెట్టి....

స్వప్నా!

నిన్ను చూసి చాలా ముచ్చట పడిపోయాను చలనం, స్పందన లేని చాలామంది ప్లాస్టిక్ పువ్వులాంటి అమ్మాయిలను చూసి చూసి విసిగిపోయాను నేను... ఏ పరిచయం నుంచైనా "నాకేం లాభం?" అని ఆలోచించని వాళ్ళు చాలా తక్కువమంది తటస్థపడ్డారు నా జీవితంలో.

నువ్వు... నువ్వు చాలా విడిమనిషివి..... నీలో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి.... నీలాంటి అమ్మాయిలు దొరకడం చాలా కష్టం.... నువ్వు తాజ్ మహల్‌వి.... గులకరాళ్ళతో తాజ్ మహల్ కట్టలేము.... నువ్వు పాలరాయివి...

కానీ,

జీవితమో, ప్రపంచమో.... నిన్ను నువ్వు సరిగా మలుచుకోవటానికి అవకాశం ఇవ్వలేదు.... నువ్వు ఆ ప్రయత్నమూ చెయ్యలేదు...

మెడిటేటర్స్, సర్వైవర్సు ఒకరకంగా బ్రతకలేరు....

జీవితాన్ని ధ్యాన్నంగా బ్రతకడం వేరు.... బ్రతక్క తప్పదనట్లు పోరాడుతూ బ్రతకడం వేరు. కాళిగారు చెప్పినట్లు నువ్వు భయాన్ని, కక్కుర్తిని గ్రాండ్ కానియన్ ఒళ్ళో విసిరివెయ్యలేదు....

అపురూపమైన అనుసంధానంతో గ్రాండ్‌కానియన్ పురివిప్పిన నెమలిలా తనలో ఇమిడిన విచిత్ర సౌందర్యాలను వెలిబుచ్చుతుంది.... సర్వేశ్వరుడి ఆ అద్భుత స్పర్శ తగిలేదాకా ఆమె శిలా తపస్వినే.....

నువ్వైనా అంతే... నీలోపలికి వెళ్ళి తొంగి చూసుకునే నీ ప్రతిబింబం......నీ ఇన్‌సెక్యూరిటీలతో చెదిరిపోతోంది... ***మనిషి తన మనుగడకు చుట్టూ పరిస్థితులమీదో, మనుష్యుల ఎమోషన్స్, ప్రవర్తనల మీదో, బ్యాంక్ బాలన్స్‌ల మీదో ఆధారపడినప్పుడు కో డిపెండెన్సీ వస్తుంది....***

మామూలుగా ప్రతిమనిషి ఇలాగే బ్రతుకుతాడు... అతని కష్టం సుఖం చుట్టుపక్కల వాతావరణాల తాలూకు నీడగా రకరకాల భంగిమలు మారుతుంది... అతనెవరో అతనికే తెలియకుండా బ్రతుకుతాడు.... వీళ్ళకు జీవితం ఆరాటం..

సర్వైవర్స్ జీవితాన్ని ఛాలెంజ్‌గా తీసుకుని, ఎవరు ఏమైపోయినా సరే వాళ్ళు బ్రతికేద్దామనుకుంటారు.. ఇది పోరాటం.

మొదట్లో నువ్వు ఇట్లాంటి స్థితిలో ఉన్న అమ్మాయివే అనుకున్నాను...

కానీ... గ్రాండ్ కానియన్, సెడోనాలో నీ అంతర్గత స్వరూపం నీకు తెలియకుండానే బయటపడింది... నువ్వు అపురూపమైన మనిషివి.

ఎందుకు మామూలు మనిషిలా ఆరాటం, పోరాటం నీ ఆయుధాలనుకుని బ్రతుకుతున్నావు?!

ఒడ్డున కూర్చుని ప్రవాహాన్ని గమనించే స్థితికి వెళ్ళు.

ఆగి, ఆలోచించుకుని, నిన్ను నువ్వు మలుచుకో... మళ్ళీ జూన్ పదకొండున ..... మనమిద్దరం గ్రాండ్ కానియన్ దగ్గర కలుసుకుందాం..........

నేను వెతికే నువ్వు కనబడితే..... సంతోషమే.... నాదొక తపస్సు....

కాకపోతే..... స్నేహితులమే..... బై... ఎస్.... ఏమిటిది?!

భయంగా గ్రీటింగ్ కార్డు తీశాను.....

Be careful not to enter another person’s life if you can not be a gift….

ఈ కొటేషన్ అంటే నాకు చాలా గౌరవం... నీ జీవితంలోకి బహుమతిగా రావాలనుకున్న రోజున వస్తాను... నీ కోసం కాదు... నాకోసం...!! -

కదిలిపోయాను నేను...

ఆ ఉత్తరం గ్రీటింగ్ కార్డ్ గుండెలకు హత్తుకుని చాలా సేపు అలా ఉండి పోయాను... ఆగని కన్నీరు.... కట్టలు తెంచుకుని......

ఏమౌతోంది నా జీవితానికి? మొదటి సారి అమ్మ చేతిలో కీలుబొమ్మ ఐన ‘ఆ‘ మహానుభావుడు నాకు సరిపోడని ఆ బంధం నుంచీ బయటికి వచ్చేస్తే ..ఇక్కడ శశి నా బంధం నుంచీ బయటికి వెళ్ళిపోయాడు.. ఎక్కడుంది లోపం... నాలోనా? ఎడ్జస్ట్ కాలేనిది నేనా..వాళ్ళా?

ఆ రోజు నుంచి..

నా జీవితంలో ప్రతిరోజూ చాలా ముఖ్యమైన రోజే... ఏం నేర్చుకున్నాను? ఎలా మారుతున్నాను?! నాకే నాలో మార్పు అర్థమౌతోంది. కోరికలు ఉన్నాయేమో కానీ అవసరాలు చాలా తక్కువ. అభద్రతతో చేసే షాపింగులు, తోచక కాలాన్ని చంపే ప్రయత్నాలు చాలా చాలా తగ్గిపోయాయి... ప్రతి విషయాన్ని అపురూపంగా చూడడం, ప్రతి వస్తువును గౌరవించడం ఎక్కడినుంచో అతని రెండు కళ్ళు నన్ను గమనిస్తున్నాయన్న భ్రాంతి నన్ను ఉత్తేజపరుస్తోంది.

ఈ నిరీక్షణకు అర్థం, ఫలితం ఉంటుందా? తెలియదు. కానీ.... అతను అన్నట్లు Means are better than ends..........

పి.హెచ్.డి కోసరం లైబ్రరీలకు తిరగడంతో అమెరికన్ ఫ్రెండ్స్‌ను చూసి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఎవరూ చూడటం లేదని తెలిసినా, ఇలా ఉంటే నన్ను నేను ప్రేమించుకోగలనా? గౌరవించుకోగలనా? అని ఆలోచిస్తూ బ్రతకడం నేర్చుకున్నాను....

చాలా తృప్తిగా ఉన్నాను....

శశి తిరిగి నా జీవితంలోకి రాకపోతే... బాధే... అయినా ఫరవాలేదు... నాతో నేను బ్రతకగలను... అది చాలా ముఖ్యం నాకు.. ఈ సంవత్సర కాలం మా మధ్య కమ్యూనికేషన్ లేకుండా బ్రతికాము.

విపరీతమైన ఎండ ఐదుగంటల నిరీక్షణ తరువాత..... చటుక్కున మబ్బులు కమ్మి వర్షం ప్రారంభమైంది....

ఆశ్చర్యపోయి చూస్తున్నాను గ్రాండ్ కానియన్‌ను - ఎన్ని హొయలు? ఎంత సౌందర్యం?!

ఎక్కడో.... ఏదో పిలుపులాంటి మెరుపు... చటుక్కున వెనక్కి తిరిగాను....

ఫ్లాష్ కాబోలు... ఎవరో ఫోటోలు తీసుకుంటున్నారు....

నిట్టూరుస్తూ వెనక్కు తిరిగాను... వర్షపు జల్లుల మధ్య ఎవరో చేయి ఊపుతున్నారు. ఎవరు? శశా?!

పరుగెత్తుతున్నాను...

చుట్టూ ఉండే రాళ్ళు, పొదలు... అద్దాల నీడల్లో ప్రతిఫలిస్తూ అడుగుజారుతానన్న భయం పెడుతున్నాయి. గళ్ళ షర్ట్.... నేనిచ్చినదే వేసుకుని రెండుచేతులూ చాచిన శశి....

పరుగున వెళ్ళి గువ్వలా ఒదిగిపోయాను... మాటలు సరిపోని మౌన సంభాషణ అది.

"నేను...నేను...." నేనేమిటి అయ్యానో చెప్పాలని నా ప్రయత్నం. కన్నీళ్ళు మాటలను ఆపడమేమిటో నాకు అర్థమౌతోంది..

నువ్వు... నువ్వు నువ్వే... నా నువ్వుగా మారి వస్తావని నాకు తెలుసు...

నిన్ను గురించి తెలుసుకుంటూనే ఉన్నాను...

హోటల్లో అతని ఒడిలో తలపెట్టుకుని ఫోటోలు చూస్తున్నాను. నన్ను గంట బట్టీ గమనిస్తూ ప్రతి కోణం నుంచీ ఫోటోలు తీశాడతను.

ఏం జరిగింది మా మధ్య ఈ సంవత్సరంలో... ఏమిటి పొందాము? ఏం పోగొట్టుకున్నాము?! ఇట్లాంటి ప్రశ్నలకు సమాధానాలు దొరకవు... 365 రోజులు దూరం అయిపోగొట్టుకున్నామా?! ప్రతిక్షణం ఆలోచనలతో దగ్గరై అల్లుకుపోయామా? అల్లుకుపోయాము కానీ ఐడెంటిటీ పోగొట్టుకోలేదు.

ప్రతి సంవత్సరం... జూన్ 11 న ఇక్కడికి వద్దాం... ఇలా చాలా ప్రామిస్‌లు చేసుకుంటున్నాము మేమిద్దరం...

మేము... మాతో బుడి బుడి అడుగుల బంగారు పాపాయిలు...

వాళ్ళ కళ్ళకు ఈ గ్రాండ్ కానియన్ ఎలా కనిపిస్తుందో?! ఊహిస్తున్నాను...

"నువ్వు నా చలనానివి... నా స్నేహానివి." చెవులో గుసగుసలాడుతున్నాడు శశి....

వరండాలో నిలబడి మరొక కోణం నుంచి గ్రాండ్ కానియన్‌ను చూస్తున్నాం ఇద్దరం..

దూరంగా గ్రాండ్ కానియన్ మరింత మౌనంగా, నిశ్చలంగా కూర్చున్న మహా తపస్వినిలా ఉన్నది... నీరెండ స్పర్శతో నిరంతరం జ్వలిస్తూ, వెన్నెల, చీకటులలో నిరంతరం ధ్యానిస్తూ... మహా విశ్వంలోకి ఒదిగిపోయిన ఆ శిలాతపస్వినికి మానసిక నమస్కారం చేశాము మేమిద్దరం.



ఉత్తమ ప్రమాణాలు గల రచనలు చేసే రచయిత్రులలో జలంధర గారు ఒకరు. పుంఖాను పుంఖాలుగా రచనలు చేయకపోయినా, వ్రాసిన కొద్ది కథలూ కలకాలం పాఠకుల గుండెల్లో నిలిచిపోతాయి. తాను స్వత హాగా రచయిత్రి ఐ ఉండీ, మిగతా రచయిత / త్రుల రచనలలోని ఉత్తమ గుణాల్ని విశ్లేషించే సాహితీ విమర్శకురాలు 'జలంధర' గారు. ఇటీవల అమెరికా సందర్శించినప్పుడు 'కౌముది' విజ్ఞప్తిని మన్నించి ఈ కథని 'కౌముది' పాఠకుల కోసం ప్రత్యేకంగా వ్రాసి ఇచ్చారు.